క్లుప్తంగా

కొండేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు



విశేషాలంకారంలో అంకమ్మ, మల్లెం కొండేశ్వరస్వామి

మర్రిపాడు : మండలంలోని చుంచులూరు గ్రామంలో అంకమ్మ మల్లెంకొండేశ్వరస్వామి దేవస్థానంలో వార్షిక ఉత్సవాలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నవ గ్రహ పూజ, గణపతి హోమం తదితర పూజా కార్యక్రమాలు జరిపించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పాల్గొని స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కోరెం మల్లికార్జున, సాంబయ్య, కొండలరావు, ఇంద్ర, మధు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగికి సత్కారం



కలిగిరి : అనంతపురం సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్న కోట అనిల్‌కుమార్‌రెడ్డి ఉత్తమ షార్ట్ ఫిలిమ్స్ డైలాగ్ రైటింగ్ విభాగంలో కేఫా (కేఈఎఫ్‌ఏ) అవార్డు అందుకున్నారు. ఈ క్రమంలో కలిగిరిలోని ఎంపీడీఓ కార్యాలయంలో వింజమూరు తాలుకా ఏపీఎన్‌జీజీఓ అధ్యక్షుడు వెలుగోటి మధు సోమవారం అనిల్‌కుమార్ రెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాలకు సంబంధించి డైలాగ్ రైటింగ్ కేటగిరీలో అనిల్ ఉత్తమ ప్రతిభ చాటి అవార్డు అందుకోవడం అభినందనీయమన్నారు.

ఎన్‌సీడీ సర్వేకు సహకరించాలి

వరికుంటపాడు : మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో జరుగుతున్న కేన్సర్ గుర్తింపు(ఎన్‌సీడీ) సర్వేకు ప్రజలు సహకరించాలని మండల వైద్యాధికారి ఆయేషా కోరారు. మండలంలోని కనియంపాడు గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు పైబడిన వారు క్షయవ్యాధి రాకుండా ముందస్తుగా అడల్ట్ బీసీజీ టీకాను వేయించుకోవాలన్నారు. అలాగే కేన్సర్ వ్యాధి లక్షణాల గుర్తింపునకు కూడా సహకరించి పరీక్షలు చేయించుకోవాలన్నారు.

సబ్సిడీపై శనగ విత్తనాల పంపిణీ

దుత్తలూరు : ఇటీవల ఫెంగల్ తుఫాన్ కారణంగా శనగ పంట దెబ్బతిన్న రైతులకు సోమవారం 80 శాతం సబ్సిడీతో శనగ విత్తనాలు పంపిణీ చేశారు. మండల కేంద్రమైన దుత్తలూరులో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి చేతుల మీదుగా రైతులకు విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉదయగిరి ఏడీఏ చెన్నారెడ్డి మాట్లాడుతూ దుత్తలూరు మండలానికి ఇప్పటి వరకు శనగ దెబ్బతిన్న రైతులకు 155 క్వింటాళ్ల శనగ విత్తనాలు మంజూరైనట్లు తెలిపారు. మండల ఏఓ ఎన్.వెంకటసుబ్బారెడ్డి, ఏఈఓ సుధీర్, వీఏఏలు పాల్గొన్నారు.

ఇస్కపల్లిలో కెనరా బ్యాంక్ వార్షికోత్సవం



ఆర్‌ఎంను సన్మానిస్తున్న సిబ్బంది

అల్లూరు : కెనరా బ్యాంక్ 50వ వార్షికోత్సవాన్ని మండల పరిధిలోని ఇస్కపల్లి పంచాయతీలో సోమవారం నిర్వహించారు. బ్యాంక్ రిజనల్ మేనేజర్ అడారి నాగబాబు హాజరై, మాట్లాడారు. బ్యాంక్ ద్వారా అందే పథకాలు, రుణాల గురించి వివరించారు. మేనేజర్ గౌతమ్ పాల్గొన్నారు.

ఇంధన పొదుపు ముఖ్యం




కావలి : ప్రస్తుత కాలంలో ఇంధన పొదుపు ఎంతో ముఖ్యమని కావలి ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి అన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాల ప్రచార బ్యానర్‌ను ఆయన సోమవారం కావలిలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ విద్యుత్ ఆదాపై అవగాహన పెంచుకోవాలన్నారు. విద్యుత్ శాఖ కావలి ఈఈ కేఎస్ బెనర్జీ, కావలి, కలిగిరి డీఈలు ఎ.రవికుమార్, టి.కృష్ణమోహన్‌బాబు, ఏఈలు వై.వసంతరావు, శ్రీనివాసులురెడ్డి పాల్గొన్నారు.

బస్‌స్టేషన్ అభివృద్ధికి చర్యలు

కలిగిరి : కలిగిరిలోని ఆర్టీసీ బస్‌స్టేషన్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని కావలి ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.శ్రీనివాసులు తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్‌స్టేషన్ ప్రాంగణాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. ఇక్కడ సౌకర్యాల కల్పనకు ఉపసర్పంచ్ పాలూరు కొండారెడ్డి విన్నవించుకున్నారని, ఈ మేరకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఆర్టీసీ సిబ్బంది డి.రవిప్రకాష్, పంచాయతీ కార్యదర్శి రవిచంద్ర పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి సేవలో..

- మాలధారణ భక్తులకు ఉచిత భిక్ష ఏర్పాటు
- దాతల సహకారంతో నిర్వహణ



భిక్ష చేస్తున్న అయ్యప్ప భక్తులు

కావలి : అయ్యప్ప మాల ధరించిన స్వాములు అనేక నియమ నిబంధనలతో దీక్ష చేస్తుంటారు. ఇందులో వారి ఆహారపు అలవాట్లు కూడా విభిన్నంగా ఉంటాయి. అయ్యప్పస్వాములు తినే ఆహారాన్ని భిక్ష అని పిలుస్తారు. అందులోనూ కొన్ని నిబంధనలను అనుసరించి ఉంటుంది. సాధారణంగా అల్లం, వెల్లుల్లి వేసి కూరలు వండుతారు. కానీ అయ్యప్ప స్వాముల భోజనంలో ఇవి లేకుండా వండుతారు. ఇలా 41 రోజుల పాటు అయ్యప్ప స్వాములు ఆహారం నుంచి శుభ్రత వరకు అనేక నియమ నిబంధనల మధ్య వారి దీక్ష కొనసాగుతుంది.

స్వచ్ఛందంగా..

అయ్యప్ప మాలధారణ భక్తులతో పాటు ఇంట్లోని వారు కూడా ఎంతో నియమ నిబంధనలు అనుసరించి ఆహారాన్ని వండుతారు. అయితే కొన్ని సందర్భాల్లో స్వాములు బయటకు వెళ్లినప్పుడు వారు ఉపవాసం ఉండే పరిస్థితి ఉంటుంది. ఇలాంటి వారి కోసం కొందరు స్వచ్ఛందంగా ఉచిత అన్నప్రసాదం అందజేస్తూ స్వామి సేవలో తరిస్తున్నారు. అయ్యప్ప భక్తులు ఇబ్బందులు పడకూడదని దాతల సహకారంతో నిత్యాన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారు.

13 ఏళ్లుగా భిక్ష ఏర్పాటు

కావలి పట్టణంలోని జనిగర్ల మహేంద్ర యాదవ్ స్థానిక గాయత్రీనగర్‌లో గత 13 ఏళ్లుగా అయ్యప్ప మాలధారణ చేసిన వారికి అన్నదానం చేస్తున్నారు. ఉదయం 500 మందికి, మధ్యాహ్నం 1,500 మందికి, రాత్రి 600 మందికి భిక్ష వసతి ఏర్పాటు చేస్తున్నారు. 60 రోజుల పాటు దీనిని నిర్విఘ్నంగా కొనసాగిస్తూనే ఉంటారు. అంతే కాకుండా ఉలవపాడు, రుద్రకోట, పట్టణంలో కలుగోళమ్మపేటలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయం, తుమ్మలపెంట గ్రామంలో భిక్షలకు కూడా బియ్యం వితరణ చేస్తుంటారు. అలాగే శబరిమలకు ఏటా సొంత ఖర్చులతో కనీసం ఐదు బస్సుల్లో శబరమలకు 225 మందిని తీసుకెళ్తుంటారు. అలాగే కావలి రూరల్, బోగోలు, దగదర్తి మండలాల్లోని పలు గ్రామాల్లో అయ్యప్పస్వాములకు సగం రోజుల పాటు భోజన వసతి కల్పిస్తారు. అంతేకాకుండా కొన్ని దేవస్థానాల్లో ఆలయ కమిటీ సభ్యులు కూడా స్వాములకు భోజన వసతి కల్పిస్తున్నారు.



స్వాములకు భిక్ష వడ్డిస్తున్న దాతలు

స్ఫూర్తిదాయకం



అన్ని దానాల్లో అన్నదానం గొప్పదంటారు. అయ్యప్పస్వాములకు భిక్ష సమకూర్చడం ఎంతో స్ఫూర్తిదాయకం. ఇలాంటివి సమాజంలో శాంతి, సుస్థిరతను కాపాడేందుకు దోహదపడతాయి. అలాంటి మంచి కార్యక్రమంలో దాతలు భాగస్వాములు కావడం సంతోషం. ఉద్యోగ, ఉపాధి రీత్యా ఇతర ప్రాంతాల నుంచి వచ్చే స్వాములకు అన్నప్రసాదం అందజేయడం గొప్ప విషయం.

– తమ్మిశెట్టి వెంకటేశ్వర్లు, గురుస్వామి, కావలి

దాతలకు కృతజ్ఞతలు



అయ్యప్ప మాలధారులకు ఉచిత అన్నప్రసాదం వండి, వడ్డించే కార్యక్రమం ఏటా కొనసాగిస్తున్నారు. ఇంట్లో మడిగా భిక్షకు అవకాశం లేని అనేక మంది స్వాములకు ఇది ఎంతో ఉపయోగకరం. దీనికి సహకరిస్తున్న దాతలకు కృతజ్ఞతలు.

– మెంటా సుబ్బారావు, అయ్యప్ప గురు స్వామి, కావలి

వేగవంతం చేయాలి

వరికుంటపాడు : మండలంలోని వరికుంటపాడు, పెద్దిరెడ్డిపల్లి పరిధిలో పశుగణన సర్వేను వేగవంతం చేసి పూర్తి చేయాలని మండల ఇన్‌చార్జి పశువైద్యాధికారి ఎస్వీఎస్ రాఘవేంద్ర శర్మ కోరారు. ఆయన పీఆర్‌పల్లి వైద్యశాల పరిధిలో జరిగే సర్వేను సోమవారం తనిఖీ చేసి సిబ్బందికి సూచనలిచ్చారు. అనంతరం మాట్లాడుతూ మండలంలో 8,347 గృహాలుండగా, సర్వే బృందం 3010 గృహాలను తిరిగి 36.06 శాతం సర్వేను పూర్తి చేశారన్నారు.

పాఠశాలలో తనిఖీలు

వరికుంటపాడు : మండలంలోని కాంచెరువు ప్రాథమిక పాఠశాలను ఎంఈఓ–2 సీహెచ్.రమణయ్య సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల పఠన సామర్థ్యాలను పరిశీలించి సూచనలు చేశారు. విద్యార్థులు పాఠశాలలోని గ్రంథాలయ పుస్తకాలను చదువుకునేలా చూడాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు.

జాబ్‌మేళా నేడు

ఆత్మకూరు : ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ నాగేశ్వరరావు సోమవారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జాబ్‌మేళా కొనసాగనుందన్నారు. ప్యానసోనిక్ లైఫ్ సొల్యూషన్స్, టీవీఎస్, అపోలో ఫార్మసీ తదితర కంపెనీల ప్రతినిధులు మేళాలో పాల్గొంటారని వివరించారు. పూర్తి వివరాల కోసం 91827 99405, 97016 20305 నంబర్లను సంప్రదించాలన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతులు

మండల కేంద్రాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. అధికారులు ఆయా అర్జీలను పరిశీలించి సంబంధిత అధికారులకు అందజేశారు.

దుత్తలూరు : ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు పంపిస్తామని తహసీల్దార్ నాగరాజు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆయన వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికీ కొంతమంది అధికారులు గ్రీవెన్స్‌డేకు హాజరు కావడం లేదని, అయినప్పటికీ వచ్చిన అర్జీలను ఆయా శాఖలకు పంపించి పరిష్కారమయ్యేలా చూస్తామన్నారు.

గురుకుల పాఠశాల సమస్యలపై..

అల్లూరు : అల్లూరు మండల పరిధిలోని నార్త్ ఆములూరులో ఉన్న జ్యోతిరావు పూలే బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థినులు పలు సమస్యలను ఎదుర్కొంటున్నారని, వాటిని పరిష్కరించాలని సీమాంధ్ర బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉల్లిపాయల శంకరయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. 5 నుంచి 10 వరకు తరగతుల్లో సుమారు 200 మంది విద్యార్థులున్నారని, అయితే ఐదు గదులు మాత్రమే ఉన్నాయన్నారు. విద్యార్థినులకు అవి సరిపోవడం లేదన్నారు. మరో ఐదు గదులు నిర్మిస్తే సమస్య కొంత వరకు పరిష్కారమవుతుందని లేదా తాత్కాలికంగా వేరే చోటుకి మార్చాలని కోరారు. ఆయన వెంట సంఘ సభ్యులు టి.బాబురెడ్డి, వి.శ్రీనివాసులు, కె.దయాకర్ యాదవ్, ఎ.మురళి, జయరామరాజు, సంధానిబాషా, శివకుమార్, సుబ్రహ్మణ్యం, వాసు పాల్గొన్నారు.



అల్లూరు : కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న బీసీ సంఘ నేతలు



ఉదయగిరి : తహసీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న రేషన్ లబ్ధిదారులు

కందిపప్పు ఇవ్వడం లేదని..

ఉదయగిరి : తమకు గత మూడు నెలలుగా కందిపప్పు ఇవ్వడం లేదని పట్టణంలోని దిలావర్‌భాయి వీధికి చెందిన రేషన్ లబ్ధిదారులు సోమవారం తహసీల్దార్ సుభద్రకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్కెట్‌లో కందిపప్పు కిలో రూ.180 ఉందని, తమకు ప్రతినెలా కందిపప్పు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వీఆర్వోలతో చర్చించి కందిపప్పు పంపిణీ జరిగేలా చూస్తానని ఆమె హామీ ఇచ్చారు.

విద్యుత్ చార్జీలు తగ్గించాలి



సోమశిల : రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ చార్జీలను తగ్గించాలని, స్మార్ట్‌మీటర్లను తొలగించాలని కోరుతూ సీపీఎం నేతలు సోమవారం అనంతసాగరం విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన తెలిపారు. అనంతరం ఏఈ మురళికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి అన్వర్‌బాషా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ.15,484 కోట్ల సర్దుబాటు చార్జీల భారాన్ని ప్రజలపై మోపడం తగదన్నారు. స్మార్ట్ మీటర్ ద్వారా గంట గంటకు రీడింగ్ లెక్కిస్తున్నారని, దీనివల్ల రాత్రి వినియోగించే విద్యుత్‌కు ఎక్కువ చార్జీ వస్తుందన్నారు. దీనిపై ప్రజలు కూడా తిరుగుబాటు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం నేతలు ఎస్డీ సంధాని, ఫక్రూస, బాబు, కరీమ్, గిరిజన శాఖ కార్యదర్శి నాగులూరు వెంకటేష్, రమేష్, మస్తాన్, జలీల్, షాహుల్ తదితరులు పాల్గొన్నారు.

హరహర మహాదేవ..



సంగం : కాశీ విశ్వేశ్వరునికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



వరికుంటపాడు : గండిపాళెంలో..

సంగం : మండలంలోని శైవక్షేత్రాలు సోమవారం హరహర మహాదేవ.. శంభోశంకరా అనే శివనామస్మరణలతో మారుమోగాయి. పరమేశ్వరుని జన్మనక్షత్రమైన ఆరుద్ర నక్షత్రం సందర్భంగా త్రివేణి సంగమం ఒడ్డున వెలసిన కామాక్షి సమేత సంగమేశ్వరునికి తెల్లవారుజామున పినాకిని నదీ జలాలతో అభిషేకించారు. మహన్యాసపూర్వక రుద్రాభిషేకం జరిపించి ఆలయ ప్రాంగణంలో పాతాళ శివలింగానికి అన్నాభిషేకం చేశారు. అదేవిధంగా తిరుమనకొండలో కొలువైన కాశీ విశ్వేశ్వరునికి పీఠాధిపతి రాజరాజేశ్వరానంద స్వామి ఉభయకర్తలతో కలిసి సకల ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. వంగల్లులోని భీమేశ్వరుడు, దువ్వూరులోని కోటేశ్వరుని ఆలయాల్లో సైతం ప్రత్యేక పూజలు నిర్వహించి విశేష పూలతో అలంకరించారు.

- వరికుంటపాడు : మండలంలోని పెద్దిరెడ్డిపల్లి కాంచెరువు, పామూరుపల్లి, వరికుంటపాడు గ్రామాల్లో శివాలయం, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం ధనుర్మాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత స్వామివార్లకు పవిత్ర జలాలు, పంచామృతాలతో విశేషాభిషేకాలు, ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు. కాగా ఉదయగిరి మండలంలోని గండిపాళెం శివాలయంలో పరమేశ్వరునికి అభిషేకాలు, సహస్ర బిల్వార్చన కార్యక్రమాలు నిర్వహించారు.

డివిజన్ స్థాయి ఆటల పోటీలు



కావలి : స్థానిక జెడ్పీ హైస్కూల్ క్రీడా మైదానంలో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి ఆటల పోటీలు సోమవారం జరిగాయి. పురుషులకు వాలీబాల్, మహిళలకు ఖోఖోతో పాటు వంద మీటర్ల పరుగు, షాట్ పుట్ పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందజేశారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం యువజనాధికారి ఆకుల మహేంద్రరెడ్డి మాట్లాడుతూ 18న కందుకూరులో, 21న నెల్లూరులో పోటీలు జరుగుతాయన్నారు. గెలుపొందిన వారు జిల్లా పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి కలిగిన యువత 99635 33440 నంబర్‌ను సంప్రదించాలన్నారు. కమిషనర్ శ్రావణ్‌కుమార్, ఎంఈఓ వెంకటసుబ్బయ్య, పీఈటీ చిరంజీవి పాల్గొన్నారు.

నేటి నుంచి శిక్షణా తరగతులు

ఉదయగిరి : మండలంలోని సచివాలయ ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు స్థానిక స్త్రీశక్తి భవనంలో మంగళవారం నుంచి రెండ్రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అప్పాజీ సోమవారం తెలిపారు. తొమ్మిది అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు.

- చేజర్ల : మండల స్థాయి అధికారులతో పాటు సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి 17, 18వ తేదీల్లో ఓరియంటేషన్ శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ విజయలలిత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 146 మంది సిబ్బందికి రెండు బ్యాచ్‌లుగా ఉదయం 9 నుంచి సాయంత్రం వరకు శిక్షణ ఉంటుందన్నారు.

రేపటి నుంచి..

అనుమసముద్రంపేట : ఈనెల 18, 19వ తేదీల్లో ఏఎస్‌పేట ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండలస్థాయి అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ప్రసన్నకుమారి తెలిపారు. ఉదయం 9 నుంచి శిక్షణా తరగతులు ప్రారంభమవుతాయన్నారు. గ్రామ పంచాయతీల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలియజేశారు.

పెన్షనర్ల సమావేశం నేడు

కావలి : రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘ సర్వసభ్య సమావేశం, ఆలిండియా పెన్షనర్స్ డే కార్యక్రమాలు స్థానిక ఫైర్ ఆఫీస్ రోడ్డులోని పెన్షనర్ల భవనంలో మంగళవారం ఉదయం 9 గంటలకు జరుగుతుందని సంఘ అధ్యక్షుడు ఆకుల రమణయ్య, కార్యదర్శి ఆదిశేషులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 75 ఏళ్లు దాటిన వారికి సన్మానం, బహుమతుల ప్రదానం తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

చిలకలమర్రిలో విజయ్ దివస్

సోమశిల : మండల పరిధిలోని చిలకలమర్రి జెడ్పీ హైస్కూల్‌లో విజయ్ దివస్ కార్యక్రమాన్ని హెచ్‌ఎం సురేష్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశరక్షణలో సైనికుల పాత్ర కీలకమైనదన్నారు. ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, మహేష్, రమణరాజు, సురేష్, మాధవి, పెద్దయ్య పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ



దుత్తలూరు : మండలంలోని నర్రవాడ ఎస్టీ కాలనీలో 40 గిరిజన కుటుంబాలకు తహసీల్దార్ నాగరాజు సోమవారం దుప్పట్లు పంపిణీ చేశారు. తన సొంత ఖర్చులతో ఒక్కో కుటుంబానికి రెండు దుప్పట్ల చొప్పున అందించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు తహసీల్దార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

సిమెంట్ బెంచీల వితరణ



ఆత్మకూరు : పట్టణంలోని పలు ప్రాంతాల్లో కరవళ్ల వరదారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ తరఫున సిమెంటు బెంచీలను వితరణగా ఏర్పాటు చేశారు. నిర్వాహకుడు కరవళ్ల రవీంద్రారెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వ ఆస్పత్రికి 2, పోలీస్‌స్టేషన్‌కు 2, తహసీల్దారు కార్యాలయానికి 2, బ్రహ్మంగారి ఆలయానికి 4, కాశీనాయన ఆశ్రమానికి 2, నల్లపరెడ్డిపల్లి గ్రామానికి 4 చొప్పున ఏర్పాటు చేయించారు.

ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టాలి



పార్టీ నేతలతో మాట్లాడుతున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

- భవిష్యత్ వైఎస్సార్‌సీపీదే
- మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మండలంలోని పడకండ్లలో ఉప సర్పంచ్ తుమ్మల చెంచురామిరెడ్డి నివాసంలో ఆయన పలు మండలాల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులతో సోమవారం మాట్లాడారు. కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోందని, రానున్న రోజుల్లో వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమని చెప్పారు. పార్టీ నేతలకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలియజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ఎస్సీసెల్ మాజీ అధ్యక్షుడు కొండా వెంకటేశ్వర్లు, జెడ్పీటీసీ పెమ్మసాని ప్రసన్నలక్ష్మి, జేసీఎస్ మండల కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర, పార్టీ నేతలు నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, చెరుకూరు కామాక్షయ్యనాయుడు, బొమ్మిరెడ్డి రవి, బత్రెడ్డి జనార్దన్‌రెడ్డి, సర్పంచ్‌లు బొలిగర్ల వెంకటేశ్వర్లు, చెలిక రమాహరిబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి ఉల్సా పెంచలయ్య, వెన్నవాడ సొసైటీ అధ్యక్షుడు కొల్లి శ్రీహరినాయుడు పాల్గొన్నారు.

సుపరిపాలన అందించాలి



జాతీయ నేతలకు నివాళులర్పిస్తున్న అధికారులు

ఆత్మకూరురూరల్ : గ్రామస్థాయిలో మౌలిక వసతుల కల్పనతో పాటు సుపరిపాలన అందించాలని ఆత్మకూరు ఎంపీడీఓ ఐజాక్ ప్రవీణ్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండలాధికారులు, ప్రజాప్రతినిధులకు సోమవారం నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో ఆయన హాజరై, మాట్లాడారు. సుస్థిరాభివృద్ధి, లక్ష్యాల సాధనకు ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా పేదరిక నిర్మూలన, అందరికీ ఆరోగ్యం, తాగునీరు, పరిసరాల పరిశుభ్రత, సామాజిక న్యాయం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈఓపీఆర్డీ డేవిడ్, ఏఓ శ్రీనివాసరావు, వెలుగు ఏపీఎం హరి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నారాయణమ్మ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుదర్శన్, పంచాయతీరాజ్ ఏఈ ఖాదర్‌మస్తాన్ పాల్గొన్నారు.

రాత్రయితే చిందులే..

- అంగన్‌వాడీ కేంద్రం వద్ద మందుబాబుల ఆగడాలు



అంగన్‌వాడీ కేంద్రం ఆవరణలో ఇదీ పరిస్థితి

కావలి : రూరల్ మండలంలోని సర్వాయపాళెం గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రం వద్ద మందుబాబుల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయి. ఇక్కడి అంగన్‌వాడీ కేంద్రం మందుబాబుల ఆవాసంగా మారింది. ప్రతిరోజు రాత్రి వేళల్లో మద్యం తాగి అరుస్తూ.. చిందులేస్తున్నారు. అనంతరం ఆయా బాటిళ్లు, వాటర్ ప్యాకెట్లు తదితర చెత్తను అక్కడే వదిలేసి వెళ్తున్నారు. దీంతో మరుసటి రోజు అంగన్‌వాడీ సిబ్బందితో పాటు చిన్నారులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పలువురికి విక్రమ్‌రెడ్డి పరామర్శ



కార్తీక్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విక్రమ్‌రెడ్డి



జనార్దన్‌రెడ్డి కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ : మండలంలోని పడకండ్ల పంచాయతీలో పలువురిని మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. స్థానికంగా వలంటీర్‌గా పనిచేసిన నిక్కం కార్తీక్ ప్రమాదవశాత్తు మరణించగా ఆతని కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. గండ్లవేడు ఎస్సీకాలనీలో మద్దు వెంకట్ ఇటీవల మరణించగా కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించారు. అలాగే ఉప సర్పంచ్ తుమ్మల చెంచురామిరెడ్డి కుమారుడు చంద్రారెడ్డి వివాహం ఇటీవల జరిగిన నేపథ్యంలో వారి నివాసానికి వెళ్లి నవ దంపతులను ఆశీర్వదించారు. స్థానిక నాయకులు దాడి శ్రీనివాసులు నాయుడు, తుమ్మల చెంచురామిరెడ్డి, ఉలవ రాఘవులు, పాశం వెంకట రమణయ్య పాల్గొన్నారు.

- సంగం : మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ నేత ఊటుకూరు జనార్దన్‌రెడ్డి తల్లి సుబ్బమ్మ ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి సోమవారం పరామర్శించారు. అదేవిధంగా పార్టీ నేత దుగ్గి అనిల్‌కుమార్ తండ్రి ప్రకాష్‌రావు ఇటీవల మృతిచెందడంతో వారి కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. పార్టీ మండల కన్వీనర్ వులగం శంకర్‌రెడ్డి, మాజీ కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి, మాజీ జెడ్పీటీసీ దేవసహాయం, పార్టీ నేతలు నయిమున్నీసా, గుండాల బాలచంద్రారెడ్డి, డాక్టర్ ప్రణీత్, మల్లి, శంకరయ్య, ఫణి, నరేష్, కోటారెడ్డి, కరిముల్లా, రమేష్, రామరావు, రాజా ఉన్నారు.